



sahanamvande.com

epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 16-07-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 104 EDITOR: ROHINI




# వాంగ్‌చుక్ దీక్షతో దద్దరిల్లుతున్న దేశం

## 18 రోజుల నిరాహార దీక్ష.. స్పందించని కేంద్రం



**కా**క్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోనం వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహారదీక్ష 18వ రోజుకు చేరుకుంది. పరీక్షల నిర్వహణలో అక్రమాలు, నీట్ పేపర్ లీక్ ఘటనలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఆ పార్టీ నేతృత్వంలో వేలాది మంది యువకులు, రాజకీయ పార్టీలు ఈ పోరాటంలో మమేకమయ్యారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో జూలై 20న పార్లమెంటు మార్చ్ చేపట్టాలని నిరసనకారులు నిర్ణయించారు. **- సహనం వందే, న్యూఢిల్లీ**

- వాంగ్‌చుక్ ఆరోగ్యంపై పెరుగుతున్న ఆందోళన
- నీట్ లీక్‌పై దేశవ్యాప్తంగా యువత ఆగ్రహం
- విద్యామంత్రి రాజీనామా డిమాండ్ ముమ్మరం
- నిరసనలో ప్రతిపక్షాల భాగస్వామ్యం
- ఈ నెల 20న పార్లమెంటుకు మార్చ్

**సో**నం వాంగ్‌చుక్ 18 రోజులుగా చేస్తున్న ఆమరణ నిరాహారదీక్ష దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. విద్యా వ్యవస్థలో జరుగుతున్న లోపాలను ప్రశ్నిస్తూ ఆయన చేపట్టిన ఈ దీక్షకు భారీగా మద్దతు లభిస్తోంది. ఆయన ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక గొప్ప పర్యావరణ వేత్త గళాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### యువతలో పెరుగుతున్న ఆగ్రహం

నిరసన ప్రదర్శనలు కేవలం ఆన్‌లైన్ వేదికలకే పరిమితం కాలేదని యువత నిరూపించారు. 45 డిగ్రీల ఎండలో, వర్షంలో సైతం వేలాది మంది ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు కొనసాగిస్తున్నారు. దేశ భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసం తాము చేస్తున్న ఈ పోరాటం సుదీర్ఘంగా సాగుతుందని వారు స్పష్టం చేస్తున్నారు. తమ గళాన్ని కేంద్రం వినాల్సిందేనని, వ్యవస్థలో మార్పు వచ్చే వరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని నిరసనకారులు తేల్చి చెప్పారు.

### విద్యాశాఖ పనితీరుపై ప్రశ్నలు

గత 10 ఏళ్లలో 93 వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని నిరసనకారులు గణాంకాలతో సహా చెబుతున్నారు. 1.19 లక్షల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడం, లక్ష పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు పనిచేయడం విద్యా వ్యవస్థ దయనీయ స్థితికి అద్దం పడుతోంది. 99 వేల పాఠశాలల్లో మరుగుదొడ్లు, 94 వేల పాఠశాలల్లో కనీస తాగునీటి సౌకర్యం లేదని నీతి ఆయోగ్ గణాంకాలు చెబుతున్నాయని, ఇవేనా మనం సాధించిన ప్రగతి అని వారు ప్రశ్నిస్తున్నారు.

### నిరసనల వెనుక అసలు ఉద్దేశం

కేవలం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మాత్రమే తమ లక్ష్యం కాదని... మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేయడమే తమ ప్రధాన ఎజెండా అని కాక్రోచ్ జనతా పార్టీ పేర్కొంది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నాణ్యమైన విద్య అందించడంలో భారత్ ప్రపంచంలోనే వెనుకబడడం సిగ్గుచేటని వారు వాపోతున్నారు.


### ప్రభుత్వంపై పెరిగిన ఒత్తిడి

నిరసనలను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆందోళనకారులు ఆరోపిస్తు న్నారు. గతంలో రైతుల ఉద్యమాల్లాగే, ఈ నిరసనలను కూడా హింసాత్మకంగా చిత్రీకరించి లాఠీఛార్జ్ చేసే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. చర్చల ద్వారా సమస్య పరిష్కారం కాకపోతే ఈనెల 20న శాంతియుతంగా పార్లమెంటు మార్చ్ నిర్వహించి ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కొనసాగిస్తామని ప్రకటించారు. ప్రజల గళాన్ని వినాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు గుర్తు చేస్తున్నారు.

### ముగింపు దిశగా పోరాటం

సోనం వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయన దీక్ష విరమించాలని పలువురు కోరుతున్నా తన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన పట్టుదలతో ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల సామాన్య ప్రజల నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. వ్యవస్థలో మార్పు రావాలంటే ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యాశాఖలో జరుగుతున్న అవకతవకలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తున్నారు.





# కాళ్ళ దగ్గరికి లగ్జరీ కార్లు

## సామాన్యుడికి చేతిలో విలాసవంతమైన కార్లు

- భారతదేశంలో బ్రిటన్ కార్ల పన్ను తగ్గింపు
- 110 శాతం నుంచి 30 శాతానికి సుంకం కోత
- 15 నుంచి అమలు... కోటా పద్ధతిలో కార్లు
- రూ. లక్షలు తగ్గనున్న జాగ్వార్, ల్యాండ్ రోవర్
- స్కాచ్ విస్కీపై సగం తగ్గిన దిగుమతి సుంకం
- జానీ వాకర్, ది మెకల్లన్, గ్లెన్‌ఫిడిచ్ ఇక చీప్

**భా**రతదేశ ఆటోమొబైల్ రంగంలో సరికొత్త శకం మొదలైంది. భారత్, యూకే దేశాల మధ్య జరిగిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం లగ్జరీ కార్ల కొనుగోలుదారులకు తీపి కబురు అందించింది. బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యే లగ్జరీ కార్లపై దశాబ్దాలుగా ఉన్న భారీ పన్నుల భారం ఒక్కసారిగా తగ్గింది. ఇకపై సామాన్యుడికి చేరువలో విలాసవంతమైన కార్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మార్పు భారతీయ మార్కెట్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. **- సహనం వందే, హైదరాబాద్**




**ల**గ్జరీ కార్లపై ఉన్న 110 శాతం దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం ఏకంగా 30 శాతానికి కుదించింది. ఈ నిర్ణయంతో జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి బ్రాండ్ల ధరలు భారీగా తగ్గనున్నాయి. కొనుగోలుదారులు లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది. విలాసవంతమైన కారును సొంతం చేసుకోవాలనే కల ఇక సాకారం కానుంది.

### కోటా పద్ధతితో నియంత్రణ

పన్ను తగ్గింపు అందరికీ అందుబాటులో ఉండదు. దీనిని ప్రభుత్వం కోటా పద్ధతిలో అమలు చేస్తోంది. మొదటి ఏడాదిలో కేవలం 20 వేల కార్లకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. ప్రతి ఏటా ఈ కోటాను పెంచుకుంటూ ఐదేళ్లలో 37 వేల కార్లకు చేరుస్తారు. షోరూమ్‌లలో కొత్త ధరల పట్టికలు సిద్ధం కావడంతో కొనుగోలుదారులు వేగంగా స్పందించాల్సి ఉంటుంది.

### శక్తివంతమైన ఇంజిన్లపై ప్రభావం

ఈ ఒప్పందం ప్రధానంగా శక్తివంతమైన వాహనాలపై ప్రభావం చూపుతుంది. 3000 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న పెట్రోల్ కార్లు, 2500 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న డీజిల్ కార్లకు ఇది వర్తిస్తుంది. లగ్జరీ ఎస్‌యూవీలను కొనుగోలు చేసే వారికి ఇది సరైన సమయం. తక్కువ పన్ను భారం వల్ల అత్యాధునిక ఫీచర్లు ఉన్న వాహనాలు తక్కువ ధరకే లభిస్తాయి.

### విస్కీప్రియులకు విందు

విస్కీ ప్రియులకు సైతం ఈ ఒప్పందం కిక్కు ఇస్తోంది. స్కాచ్ విస్కీపై ఉన్న 150 శాతం దిగుమతి సుంకాన్ని 75 శాతానికి తగ్గించారు. రాబోయే పదేళ్ళలో ఇది 40 శాతానికి చేరుతుంది. ఇది కేవలం బ్రిటన్ తయారీ బాటిళ్లకు మాత్రమే వర్తిస్తుంది. జానీ వాకర్, ది మెకల్లన్, గ్లెన్‌ఫిడిచ్ వంటి బ్రాండ్ల ధర తగ్గనున్నాయి. అయితే ఎక్సైజ్ పన్నులు యథాతథంగా ఉండటంతో సగం ధరకే బాటిల్ లభిస్తుందనేది అపోహ మాత్రమే.

### ఐటీ నిపుణులకు ఆర్థిక భరోసా

యూకేలో పనిచేసే లక్షలాది మంది భారతీయులకు ఈ ఒప్పందం భారీ ఊరటనిచ్చింది. డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్ ద్వారా సోషల్ సెక్యూరిటీ పేరుతో జరిగే జీతంలో కోతకు తెరపడింది. ఇది ఐటీ నిపుణుల చేతికి అందే జీతాన్ని నెలకు 20 నుంచి 25 శాతం వరకు పెంచుతుంది. తద్వారా మన దేశంలోకి వచ్చే నగదు ప్రవాహం వేల కోట్ల రూపాయల్లో పెరిగే అవకాశం ఉంది.

### స్వదేశీ పరిశ్రమల రక్షణ


విదేశీ వస్తువుల రాకతో పోటీ పెరిగినా దేశీయ పరిశ్రమలకు ముప్పు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పాల ఉత్పత్తులు, చక్కెర, పప్పుధాన్యాల వంటి సున్నితమైన రంగాలను ఈ ఒప్పందం నుంచి మినహాయించారు. స్థానిక రైతులకు, చిరు వ్యాపారులకు ఎటువంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విదేశీ పోటీని తట్టుకుని స్వదేశీ వస్తువుల నాణ్యతను పెంచుకోవడమే ఇప్పుడున్న లక్ష్యం.

# అవినీతి టాపర్లు

## వందల కోట్ల లంచాలు... అక్రమాస్తుల కోటలు

- తెలంగాణలో ఏసీబీ వలలో తిమింగలాలు
- సామాన్యుడిని పీడిస్తున్న దందా రాయుళ్లు
- దర్యాప్తులో విస్తుగొల్పే నిజాలు

**తె**లంగాణలో ప్రభుత్వ అధికారుల అవినీతి కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు వేలు, లక్షల కోసం కక్కుర్తి పడ్డ అధికారులు ఇప్పుడు వందల కోట్ల ఆస్తులను కూడబెడుతూ అడ్డంగా దొరికిపోతున్నారు. ప్రజల సొమ్ముతో విలాసాలు అనుభవిస్తూ అవినీతిలో టాపర్లుగా నిలుస్తున్న ఈ బడా అధికారుల బండారం ఒక్కొక్కటిగా బయటపడుతోంది. ఏసీబీ దాడుల్లో బయటపడుతున్న అక్రమాస్తుల లెక్కలు చూస్తుంటే సామాన్యుడికి మైండ్ బ్లాక్ అవ్వక తప్పదు. **- సహనం వందే, హైదరాబాద్**




**హె**చ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్ అవినీతి ఉదంతం వ్యవస్థలోని కుళ్ళను బయటపెట్టింది. బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే రవీందర్ ఏకంగా 100 కోట్ల ఆస్తులు కూడబెట్టాడు. ఇతని ఇంట్లో సోదాల్లో 45 లక్షల నగదు, కిలోన్నర బంగారం, 12.5 కిలోల వెండి బయటపడ్డాయి. వీటితో పాటు శంషాబాద్, కృష్ణాపూర్, పసుమాములలో ప్లాట్లు, నార్సింగి, నానక్‌రామ్‌గూడలో 4 ఫ్లాట్లు, గూడూరులో 4 ఎకరాల భూమి, మోకిలాలో విల్లా, కొండాపూర్‌లో 4 అంతస్తుల వాణిజ్య భవనం ఉన్నట్లు తేలింది. వీటి మార్కెట్ విలువ 100 కోట్ల పైమాటే అని అధికారులు అంచనా వేస్తున్నారు.

### అధికారంతో సాగించిన అక్రమ దందా

రవీందర్ ఎలివేటెడ్ కారిడార్ల టెండర్లు, ఔటర్ రింగ్ రోడ్డు లీజు వ్యవహారాలను తన అవినీతికి మార్గంగా మార్చుకున్నాడు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారమే ఇతని ఆస్తులు 9.24 కోట్లుగా ఉన్నాయని ఏసీబీ ప్రకటించింది. ప్రస్తుతం ఇతడిని జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. అక్రమ ఆస్తులు, బినామీ లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

### పోలీస్ అధికారి అక్రమ సామ్రాజ్యం

తెలంగాణ పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ డీఎస్పీ సంకిరెడ్డి భీంరెడ్డి అవినీతి లెక్కలు అంతకుమించి ఉన్నాయి. తెలంగాణ, కర్ణాటకలో 16 చోట్ల సోదాలు చేయగా ఇతని అక్రమ ఆస్తులు బయటపడ్డాయి. 44 ఎకరాల వ్యవసాయ భూమి,బెంగళూరులో కమర్షియల్ స్థలాలు,కిలోల కొద్దీ బంగారం, వెండి ఏసీబీకి దొరికాయి. ఇతడు రాసిన డైరీ ఆధా రంగా ఇతని అక్రమ సంపాదన 300 కోట్లు ఉంటుందని తేల్చారు. ఈ భారీ అవినీతి కారణంగా ఇతడిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

### ఎక్సైజ్ అధికారి అక్రమార్జన

నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి గత జూన్‌లో ఏసీబీకి దొరికిపోయాడు. 11 ప్రాంతాల్లో సోదాలు చేయగా కోట్ల విలువైన స్థిర, చరాస్తులను గుర్తించారు. ఇందులో 4 నివాస గృహాలు, ఒక కమర్షియల్ బిల్డింగ్, 8 ఓపెన్ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇవి కాకుండా ఇంట్లో 3.31 లక్షల నగదు, బ్యాంకుల్లో 50 లక్షలు, ఒక ఎస్‌యూవీ కారు, స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు.

### దర్యాప్తులో కొనసాగుతున్న బినామీల వేట

అవినీతి అధికారుల బంధువులు, సహచరుల ఇళ్లలో కూడా దాడులు నిర్వహించి ఆస్తులను ఏసీబీ గుర్తించింది. బినామీ పేర్లతో దాచిన ఆస్తులను పట్టుకునేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు. గత నెల రోజుల్లో ఏసీబీకి దొరికిన ఈ అవినీతి తిమింగలాలు వ్యవస్థలో పాతుకు పోయిన వేర్లను తెలియజేస్తున్నాయి. ప్రతి అక్రమ లావాదేవీని కూలంక షంగా విశ్లేషిస్తున్న ఏసీబీ నిందితులను శిక్షించేందుకు సిద్ధమవుతోంది.

### వ్యవస్థలో పెరిగిన అవినీతి...

ప్రభుత్వ బాధ్యతలను నిర్వహించాల్సిన వారే ప్రజా ధనాన్ని దోచుకోవ డం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు చిన్న మొత్తాలతో దొరికిన అధికారులు, ఇప్పుడు వందల కోట్లతో పట్టుబడుతున్నారు. ఈ వరుస దాడులు అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఏసీబీ పట్టుబిగిస్తున్న కొద్దీ బయటపడని మరిన్ని అవినీతి పీఠాలు బయటపడే అవకాశం ఉంది.